సంపుటి : 9
సంచిక : 323
శనివారం
15 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వం వాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999





విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం

ఒకప్పుడు కుటుంబం అంటే బాధ్యత. బంధం అంటే నమ్మకం. ప్రేమ అంటే త్యాగం. వివాహం అంటే జీవితాంతం కలిసి నడిచే ప్రమాణం. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ సుఖాలను త్యాగం చేసేవారు. కుటుంబ గౌరవం కోసం వ్యక్తిగత కోరికలను అదుపులో పెట్టుకునేవారు. కానీ సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనలు మనల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. క్షణికావేశం కోసం జీవితాలను నాశనం చేసుకోవడం... అక్రమ బంధాల కోసం కుటుంబాలను చీల్చుకోవడం... అనుమానం పేరుతో జీవిత భాగస్వామిపై దాడులకు దిగడం... ప్రేమ పేరుతో వేధింపులు, తిరస్కరణను తట్టుకోలేక హింసకు పాల్పడడం... ఆస్తి, కోపం, ప్రతీకారం కోసం సొంత వారినే శత్రువులుగా చూడడం వంటి ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది స్త్రీ సమస్య కాదు. పురుషుడి సమస్య మాత్రమే కాదు. ఇది విలువలు కోల్పోతున్న మనిషి సమస్య.

**ధైర్యం అంటే హింస కాదు**

పురుషత్వం అంటే కోపం కాదు. ఆధిపత్యం కాదు. అనుమానం కాదు. బలవంతం కాదు. కుటుంబాన్ని కాపాడటం, బాధ్యతను మోయటం, కష్టసమయంలో నిలబడటం, తన భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవటం, స్త్రీని గౌరవించడం – ఇవే నిజమైన ధైర్యానికి గుర్తులు. అలాగే స్త్రీ శక్తి అంటే ప్రతీకారం కాదు. కుటుంబ బంధాలను విచ్ఛిన్నం చేయడం కాదు. ఆత్మగౌరవంతో పాటు బాధ్యత, సహనం, వివేకం, ప్రేమ, మానవత్వం కలిసినప్పుడే సమాజానికి ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. స్త్రీ అయినా పురుషుడైనా... తప్పు తప్పే. నేరం నేరమే. కుటుంబం కోసం త్యాగమా?.. కోరిక కోసం విధ్వంసమా? ఒక చిన్న కోరిక కోసం ఎన్నో సంవత్సరాల కుటుంబ జీవితం నాశనం చేసుకోవడం ఎందుకు? కొన్ని క్షణాల ఆకర్షణ కోసం పిల్లల భవిష్యత్తును చీకటిలోకి నెట్టడం ఎందుకు? అనుమానం, ఈర్ష్య, స్వార్థం, కామం, ప్రతీకారం వంటి భావోద్వేగాలకు మనిషి బానిసైతే చివరకు మిగిలేది ఏమిటి? ఒక హత్య జరిగితే ఒక ప్రాణమే పోదు. ఒక కుటుంబం

మిగతా .. 2లో..

క్లిష్ట పరిస్థితుల్లోనూ బలమైన

## ఆర్థిక వ్యవస్థగా భారత్

**రాష్ట్రపతి ద్రౌపదీముర్ము**



**దిల్లీ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** వికసిత్ భారత్–2047 లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. "జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక

మిగతా .. 2లో..

భారత్‌కు రానున్న

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



**ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 2024లో

మిగతా .. 2లో..

అమరావతి అసెంబ్లీలో ఘనంగా

## 'మన సభ - జన సభ'

- ప్రజజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేయడమే లక్ష్యం
- శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు




**అమరావతి, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహిస్తూ,ప్రజలను ప్రజాస్వామ్య వ్యవస్థకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో చేపట్టిన 'మన సభ – జన సభ' కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణం సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ఏపీ పోలీస్ బ్రాస్ బ్యాండ్ సింఫనీతో సందడిగా మారింది. ప్రజలు,విద్యార్థులకు అసెంబ్లీ ప్రాంగణంలోకి ఉచిత ప్రవేశం కల్పించి ఉభయ సభల సందర్శనకు అవకాశం కల్పించడం విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ, 'మన సభ – జన సభ' కార్యక్రమం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజల ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనడం హర్షణీయమన్నారు. తాను గతంలో సామాన్యుడిగా ఉన్నప్పుడు శాసనసభ ప్రాంగణంలోకి రావడానికి అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం సామాన్య ప్రజలకు సైతం ఉభయ సభలను సందర్శించే అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు. ప్రజలను

మిగతా .. 2లో..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో

## తాగునీటికి ప్రాధాన్యత



- వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ
- డేటా సెంటర్లకు నీటి సీటి సరఫరాపై దుష్ప్రచారం
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో

మిగతా .. 2లో..

విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యంలో

## శిక్షణ ఇస్తున్నాం : సీఎం రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా ఫులే విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుతో తలరాత మారి.. సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం

మిగతా .. 2లో..

పోలవరం సివిల్ వర్క్స్

## 90 శాతం పూర్తయ్యాయి

**రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**




**పోలవరం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** వెలిగొండ ప్రాజెక్టులతో పాటు మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు, ఐడిసి లిఫ్ట్ స్కీం, వంటి అంశాలతో పాటు,ఎల్ నినో వంటి సందర్భంలో త్రాగునీటి అవసరాల

మిగతా .. 2లో..

వ్యక్తిగత దూషణలొద్దు..


## వారి ట్రాప్‌లో పడొద్దు

**ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశం**



**అమరావతి, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** సోషల్‌మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. "వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు. అసభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లాడండి. పార్టీ అంతర్గత విషయాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని ఉపేక్షించం. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా

మిగతా .. 2లో..




## జిల్లా సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ**



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, సాగునీరు, వైద్యం, గృహ నిర్మాణం తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై జరిగిన చర్యలను ఎమ్మెల్యేలతో చర్చించారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు మాట్లాడుతూ ముద్రా రుణాలతో పాటు ఇతర రుణాల కల్పనకు బ్యాంకర్ల ఆధ్వర్యంలో రుణ మేళాలు నిర్వహించాలని సూచించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, తితిదే పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువ వెంబడి ఖాళీగా ఉన్న వరద కరకట్ట స్థలాలను ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరారు. దీనివల్ల భూసేకరణకు అయ్యే ప్రభుత్వ నిధులను ఆదా చేయవచ్చన్నారు. జగ్గంపేట ప్రాంతంలో జాతీయ రహదారి ప్రమాదాల దృష్ట్యా ఎముకల వైద్య నిపుణులను నియమించాలని, ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. గతంలో మంజూరై నిలిచిపోయిన గృహాలను దశలవారీగా నిధులు కేటాయించి పూర్తి చేయాలని

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# చదువు సరిపోదు... సంస్కారం కావాలి!

అనాథ అవుతుంది. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతారు. తల్లిదండ్రులు పిల్లలను కోల్పోతారు. నిందితుడి కుటుంబం కూడా శిక్ష అనుభవిస్తుంది. ఒక క్షణం చేసిన నేరానికి కొన్ని కుటుంబాలు జీవితాంతం మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

**పిల్లలకు మార్కులు మాత్రమే నేర్పుతున్నామా?**

మన విద్యా వ్యవస్థలో పిల్లలకు గణితం నేర్పుతున్నాం. విజ్ఞానం నేర్పుతున్నాం. భాషలు నేర్పుతున్నాం. ఉద్యోగం ఎలా సంపాదించాలో చెబుతున్నాం. కానీ... కోపాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలి? తిరస్కరణను ఎలా స్వీకరించాలి? ప్రేమలో ఓటమిని ఎలా ఎదుర్కోవాలి? వివాహ బంధంలో సమస్య వస్తే ఎలా పరిష్కరించుకోవాలి? స్త్రీని ఎలా గౌరవించాలి? పురుషుడిని ఎలా గౌరవించాలి? చట్టాన్ని అతిక్రమిస్తే ఏ శిక్ష పడుతుంది? ఒక నేరం వల్ల ఒక కుటుంబం ఎలా నాశనం అవుతుంది? ఈ విషయాలను పిల్లలకు ఎంతవరకు నేర్పుతున్నాం? పరీక్షల్లో నూరు మార్కులు సాధించిన విద్యార్థి జీవిత పరీక్షలో విఫలమైతే ఆ చదువు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతుంది?

**ప్రతి పాఠశాలలో 'జీవిత విద్య' అవసరం**

ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలతో పాటు జీవన విలువలపై ప్రత్యేక బోధన అవసరం. ధర్మం-అధర్మం, మంచి-చెడు, బాధ్యత-స్వార్థం మధ్య తేడాను చిన్న వయసులోనే తెలియజేయాలి. హత్య, లైంగిక నేరాలు, వేధింపులు, మత్తుపదార్థాలు, అంతర్జాల నేరాలు, గృహహింస వంటి నేరాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలను వయసుకు అనుగుణంగా విద్యార్థులకు తెలియజేయాలి. "నేరం చేస్తే తప్పించుకోవచ్చు" అనే భావన కాదు... "నేరం చేస్తే జీవితమే మారిపోతుంది" అనే అవగాహన కలగాలి.

**ఇంటినుంచే మొదలవ్వాలి**

సంస్కారం పాఠశాలలో మాత్రమే నేర్చుకునేది కాదు. తల్లిదండ్రులు పిల్లల ముందు ఎలా మాట్లాడుతున్నారు? స్త్రీలను ఎలా గౌరవిస్తున్నారు? కుటుంబ సభ్యుల మధ్య విభేదాలను ఎలా పరిష్కరిస్తున్నారు? కోపాన్ని ఎలా అదుపులో ఉంచుతున్నారు? పిల్లలు ఇవన్నీ చూస్తూనే పెరుగుతారు. మన మాటలకంటే మన ప్రవర్తనే పిల్లలకు పెద్ద పాఠ్యపుస్తకం.

**సాంకేతికత పెరిగింది... సహనం తగ్గిందా?**

చేతిలో ప్రపంచం ఉంది. కానీ పక్కనున్న మనిషిని అర్థం చేసుకునే ఓపిక తగ్గిపోతోందా? ఒక్క సందేశానికి సమాధానం రాకపోతే అనుమానం. ఒక స్నేహానికి అర్థం మార్చడం. సామాజిక మాధ్యమాల్లో చూసిన జీవితాలను తమ జీవితాలతో పోల్చుకోవడం. ఇవి యువత భావోద్వేగాలపై ప్రభావం చూపుతున్నాయి. సాంకేతికతను తప్పుబట్టడం పరిష్కారం కాదు. దాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పడమే పరిష్కారం.

**ప్రేమ అంటే ప్రాణం తీయడం కాదు**

ఎవరైనా మన ప్రేమను తిరస్కరిస్తే వారిని వేధించే హక్కు మనకు లేదు. వివాహ బంధం కొనసాగకపోతే చట్టబద్ధ మార్గాలు ఉన్నాయి. కుటుంబంలో సమస్యలుంటే పెద్దలు, సలహాదారులు, న్యాయవ్యవస్థ సహాయం పొందవచ్చు. కానీ హత్య ఎప్పటికీ పరిష్కారం కాదు. ప్రేమ పేరుతో ప్రాణం తీసేవాడు ప్రేమికుడు కాదు అనుమానం పేరుతో హింసించేవాడు జీవిత భాగస్వామి కాదు.

**మళ్లీ మనిషిని తయారు చేసే విద్య కావాలి**

దేశానికి వైద్యులు కావాలి. ఇంజినీర్లు కావాలి. అధికారులు కావాలి. శాస్త్రవేత్తలు కావాలి.

అన్నిటికంటే ముందు... మంచి మనుషులు కావాలి. చదువుతో జ్ఞానం వస్తుంది. సంస్కారంతో వ్యక్తిత్వం వస్తుంది. ధర్మంతో బాధ్యత వస్తుంది. చట్ట అవగాహనతో నియంత్రణ వస్తుంది. మానవత్వంతో సమాజం నిలుస్తుంది.

**ఇప్పటికైనా మేలుకోకపోతే...**

పరువు, ప్రతిష్ఠ, బంధాలు, అనుబంధాలు, ప్రేమ, త్యాగం వంటి పదాలు కేవలం నిఘంటువుల్లో మిగిలిపోయే పరిస్థితి రాకూడదు. ప్రతి ఇంట్లో విలువలపై చర్చ జరగాలి. ప్రతి పాఠశాలలో సంస్కారం బోధించాలి. ప్రతి కళాశాలలో చట్ట అవగాహన కల్పించాలి. ప్రతి యువకుడికి భావోద్వేగ నియంత్రణ నేర్పాలి.

**లేకపోతే...**

మనిషి విద్యావంతుడవుతాడు... కానీ మానవత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. చదువు మనిషికి ఉద్యోగం ఇవ్వవచ్చు. సంస్కారమే అతన్ని నిజమైన మనిషిగా నిలబెడుతుంది.

## ఆర్థిక వ్యవస్థగా భారత్

సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశమిచ్చింది**

ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు ఎక్కడ దాక్కున్నా.. పర్యవసానాలు ఎదుర్కోక తప్పదనే గట్టి సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ పంపిందన్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాలను, ముఖ్యంగా రైతులను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న నిర్ణయాత్మక చర్య అని చెప్పారు. నీటి హక్కుల గురించి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలోనే రాష్ట్రపతి తన ప్రసంగంలో ఈ ప్రస్తావన తేవడం గమనార్హం.

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. గతేడాది బ్రెజిల్ వేదికగా ఈ సదస్సు జరగగా.. అనంతరం ఈ ఏడాది అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది. బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. గతేడాది ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ఇదిలా ఉంటే, రెండు నెలల క్రితం దిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భారత్‌కు వచ్చిన సంగతి తెలిసిందే.

## 'మన సభ - జన సభ'

ప్రజాస్వామ్య వ్యవస్థకు చేరువ చేసే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 'మన సభ - జన సభ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శాసనసభ కేవలం ప్రజాప్రతినిధులు సమావేశమయ్యే భవనం మాత్రమే కాదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిధ్వనిగా నిలిచే ప్రజాస్వామ్య దేవాలయం అని అభివర్ణించారు. రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు అసెంబ్లీ గ్యాలరీ నుంచి శాసనసభా కార్యక్రమాలను వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని స్పీకర్ తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని, యువత భాగస్వామ్యం పెరిగినప్పుడే రాజకీయ వ్యవస్థ మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉంటుందని అన్నారు. గతంలో రాజకీయాలు ఉన్నత విలువలు, ఆదర్శాలతో కొనసాగేవని గుర్తుచేశారు. ప్రజలకు శాసనసభ సందర్శన వంటి ప్రజాస్వామ్య సంప్రదాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు, శాసన వ్యవస్థకు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు సైతం అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పించడం ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. 'మన సభ - జన సభ' కార్యక్రమం ప్రజలకు శాసన వ్యవస్థను మరింత చేరువ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల కోసం శాసనసభ ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర మాట్లాడుతూ, 'మన సభ - జన సభ' కార్యక్రమం శాసన వ్యవస్థలోనే ఒక వినూత్న నిర్ణయమని కొనియాడారు. ప్రజల మధ్య, ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ప్రజాస్వామ్య వ్యవస్థపై వారికున్న ఆసక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా కె.ఎల్. యూనివర్సిటీ విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు ఆహూతులను, సందర్శకులను ఉత్సాహపరిచాయి. ఏపీ పోలీస్ బ్రాస్ బ్యాండ్ సింఫనీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కాజ వెంకట సుబ్రమణ్యం శిష్యురాలు ఇరుకులపాటి లక్ష్మీ సహస్ర ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, ప్రజలను అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించి ఉభయ సభల సందర్శనకు అవకాశం కల్పించారు. అసెంబ్లీ భవనం, శాసనసభ, శాసన మండలి కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలను సందర్శించిన ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో అసెంబ్లీ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రజలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్న నిర్ణయం పట్ల సందర్శకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కూడా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉభయ సభల సందర్శనకు ప్రజలకు అవకాశం కల్పించనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సంప్రదాయ చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను గోదావరి నీటితో నింపాలని, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సబ్సిడీలను మరింత పెంచి ప్రోత్సహించాలని జ్యోతుల నెహ్రూ కోరారు. ప్రతి సీహెచ్‌సీ పరిధిలో వెంటిలేటర్లు ఏర్పాటు చేసి, వాటి నిర్వహణకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించాలని సూచించారు. కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కోసం గతంలో డిపాజిట్ చేసిన లబ్ధిదారులకు నగదు తిరిగి చెల్లించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో రెండు అన్న క్యాంటీన్లు మంజూరు చేయాలని, మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టడంతో పాటు టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. చొల్లంగిలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు నీటి సరఫరా, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ రూరల్ మండలంలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి నీటి ఎద్దడి నివారించాలని కోరారు. కాలం చెల్లిన పైపులైన్లను తొలగించి పునరుద్ధరించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. రూరల్ ప్రాంతంలోని చెత్తాచెదారాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసేందుకు ప్రతిపాదించిన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రాజెక్టును త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని కోరారు. ఇటీవల కామెర్లు వ్యాధి వ్యాప్తితో ప్రజలు ఆందోళనకు గురైన నేపథ్యంలో వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. ఏపీఐఐసీ కింద పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించి స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. మిగిలిన ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో పాటు మంజూరైన హార్బర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, టిడ్కో గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. పంటల బీమా గడువును పెంచాలని ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై మంత్రి పొంగూరు నారాయణ స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సంప్రదించి పంటల బీమా గడువు పెంపుపై ప్రయత్నిస్తామని తెలిపారు. దశలవారీగా నిధులు సమకూర్చి జిల్లాలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేసి పంటలను కాపాడాలని ఆదేశించారు. ఉద్యాన, జలవనరులు, గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం, మత్స్య శాఖల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న రహదారులు, తాగునీరు తదితర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణం, ఆరోగ్య భద్రత వంటి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఏలేరు ఆయకట్టుకు విడతల వారీగా సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు సూచించిన తాగు, సాగునీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పెండింగ్ పనులను పూర్తి చేసి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలను అర్హులైన వారికి అందించేందుకు కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో వి.బి.జి. రామ్‌జీ పథకం ద్వారా పుంత రహదారుల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీఐఐసీ కింద పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించి మూడు సంవత్సరాలు దాటినా పరిశ్రమలు స్థాపించని వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకినాడ జీజీహెచ్‌లో కార్డియాలజిస్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డీఆర్‌సీ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను శాఖల వారీగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ యనమల దివ్య, ఎమ్మెల్సీ పేరాభక్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే పి.దొరబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఆర్డీవోలు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారి ట్రాప్‌లో పడొద్దు

మాట్లాడాలి. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో చిక్కుకోవద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి. పార్టీ అభ్యున్నతి, కష్టపడి పనిచేసే వారి సంక్షేమం పార్టీ దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి" అని పవన్ పిలుపునిచ్చారు.

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యత

శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు.

**డేటా సెంటర్లకు 3.5 టీఎంసీల నీరు చాలు**

డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని.. మొత్తంగా వాటికి 3.5 టీఎంసీల నీరే సరిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్ లో ఆరు తడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగేలా జల ధార- జల హారతి పనుల్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కృష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ, సీఈలు హాజరయ్యారు.

## శిక్షణ ఇస్తున్నాం : సీఎం రేవంత్

ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని చెప్పారు. "ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుంది. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం ఎర్ర తివాచీతో స్వాగతం పలుకుతోంది. అలాంటి వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయి. ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చింది. ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలి. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం నేర్పిస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా పంపిస్తాం. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తాం"అని సీఎం అన్నారు.

## 90 శాతం పూర్తయ్యాయి

నిమిత్తం ఏ రకంగా ప్రణాళిక తీసుకుంటున్నాం అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో చర్చించడం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90% పూర్తయ్యాయని, భూసేకరణ 94% పూర్తిచేశామని,అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52% పూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు ఇప్పటి వరకు 77% పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు.మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి,కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు గారు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా, 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు.

**2027 మార్చి నాటికే పోలవరం పూర్తి.**

ఈవిధంగా పోలవరం ప్రాజెక్టుకు వాస్తవంగా ఇచ్చినటువంటి షెడ్యూల్ 2027 డిసెంబర్, కానీ చంద్రబాబు నాయుడు గారు పుష్కరాలు వస్తూ ఉన్నాయి కాబట్టి, పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయండి, మార్చి నెలకే అని ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారమే ఈ 2027 మార్చి కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంగానే పనులు జరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల మొదటి సారి, గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినటువంటి పరిస్థితిలో కూడా పనులు ఆగకుండా జరుగడం పట్ల సిఎం చంద్రబాబు అభినందించారని తెలిపారు.అందుకే గ్యాప్-1 ఈసిఆర్ఎఫ్ పనులు 48%, గ్యాప్-2 ఈసిఆర్ఎఫ్ పనులు 36% పూర్తయ్యాయని వివరించారు.ఈవిధంగా ఈసిఆర్ఎఫ్ డిజైన్స్ ప్రకారం 45.72 మీటర్లకు పూర్తి చేసుకోగలుగుతున్నామని, ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం వల్ల ఆప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న గండిపోచమ్మ దేవాలయాన్ని పరిరక్షిస్తూ,స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని సిఎం ఆదేశించారని అన్నారని మంత్రి నిమ్మల తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసిందని ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమన్న దశ నుంచి, 2027 కల్లా పోలవరాన్ని పూర్తి చేస్తున్నాము అనేటటువంటి భరోసాను ప్రజలకు కల్పించామని స్పష్టం చేశారు. అదేవిధంగా పోలవరానికి సంబంధించిన ఎడమ ప్రధాన కాలువ(రావీజ) 2019 - 2024 ఐదు సంవత్సరాల్లో గత ప్రభుత్వం ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని మంత్రి పేర్కొన్నారు. ఉత్తరాంధ్రాకి సాగునీరు, తాగునీరు,విశాఖపట్నానికి పారిశ్రామిక అవసరాలకు సైతం నీళ్ళిచ్చే పోలవరం ఎడమ ప్రధాన కాలువను ఐదు సంవత్సరాలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, ఆ ప్రాజెక్టుని నీరుగారిస్తే, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1500 నుండి 1800 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, ఎల్ఎమ్‌సి (లెఫ్ట్ మెయిన్ కెనాల్) చాలా క్రిటికల్ వర్క్స్ తో పాటు, 11 చోట్ల నేషనల్ హైవేస్ క్రాస్ చేసేటటువంటి క్రిటికల్ వర్క్స్ ని సైతం అధిగమించామని అన్నారు. పంపా,తాండవ,ఏలేరు రిజర్వాయర్ అదేవిధంగా వరాహ ఇటువంటి నదులను అన్నీ కూడా, క్రాస్ చేసేటటువంటి కెనాల్ వర్క్స్ గాని, ఇలా క్లిష్టమైన పనులను కేవలం రెండేళ్ళలోనే పూర్తి చేసుకుని, ఈ నెలాఖరు కల్లా ఆ పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుండి నీటిని విడుదల చేసి, ఉత్తరాంధ్రాకి అనకాపల్లి వరకు కూడా గోదావరి జలాలు తీసుకెళ్లే పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు.

**విశాఖ డేటా సెంటర్లకు గోదావరి జలాలు.**

కొంతమంది వైసిపి పార్టీ నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నంలో గూగుల్ తో పాటు వచ్చే ఇతర డేటా సెంటర్స్ కు నీళ్లే లేవని మాట్లాడుతూ ఉన్నారు.వాళ్ల పరిపాలన ఉంటే అట్లానే ఉంటుంది.కానీ ఈరోజు పరిపాలన కూటమి ప్రభుత్వ పరిపాలన,చంద్రబాబు నాయుడు గారి పాలన. ఈరోజు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ తోటి విశాఖకి గాని, ఉత్తరాంధ్రాకి గాని పుష్కలంగా నీరు వస్తుంది. గూగుల్ గాని, ఇతర డేటా సెంటర్స్ గాని మొత్తం సంవత్సరానికి మూడు టిఎంసి ల నీళ్లు అవసరం అవుతాయని, ఆనీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అందిస్తామని అన్నారు.

**వెలిగొండ నిర్వాసితులకు 600 కోట్లు క్లియర్ చేయబోతున్నాం.**

మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు. ఆ వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కూడా హెడ్ రెగ్యులేటర్స్, టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్, ఫీడర్ కెనాల్ కి సంబంధించినటువంటి సిసి వాల్, ఫీడర్ కెనాల్ సిసి లైనింగ్, నల్లమల సాగర్ కి సంబంధించినటువంటి రెగ్యులేటర్స్ పనులన్నిటినీ కూడా ఈ నెల 25కి పూర్తి చేసుకుంటూ, దానితో పాటుగా. టన్నెల్-2 లో చిక్కుకున్నటువంటి టిబిఎమ్ మిషన్ కూడా, దగ్గర దగ్గర 1900 టన్నుల ఐరన్ కి గానూ, ఇప్పటికీ 1500 టన్నులు తొలగించామని చెప్పారు. మిగిలిన బ్యాలెన్స్ 400 టన్నులని కూడా డిస్మాంటిల్ చేసి అది కూడా కటింగ్ అవ్వకపోతే మళ్లీ గ్రానైట్ కటింగ్ మిషన్ తో సహా, డైమండ్ కటింగ్ మిషన్ ని కూడా తీసుకొచ్చి దానికి కూడా ట్రయల్ చేసి. ఇలా ఇన్ని కష్టాల మధ్య అర్ధరాత్రి కూడా షిఫ్టులు పెట్టుకుని పనులు జరుగుతూ ఉన్నాయి అని అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## పార్లమెంటులో కూడా వైసీపీని వదల్లేదు..!

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాయి. సుమారు 20 రోజుల పాటు సాగిన సమావేశాల తీరు వాయిదాల పర్వంగా ముగిసింది. అయితే.. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 25మంది ఎంపీల పనితీరు ఎలా ఉంది? ముఖ్యంగా టీడీపీ వర్సెస్ వైసీపీ ఎంపీల దూకుడు.. ఈ సభలో ఎలా కనిపించింది? అనేది ఇంపార్టెంట్. ఎందుకంటే.. రాష్ట్రంలో పార్టీ పుంజుకుందా? లేదా? గ్రాఫ్ ఎలా ఉంది? అని చెప్పడానికి పార్లమెంటులో అనుసరించే వ్యూహాలే కీలకంగా మారుతున్నాయి. దీంతో తాము పుంజుకుంటున్నామని చెబుతున్న వైసీపీ పార్లమెంటులో ఎలా వ్యవహరించిందన్నది ముఖ్యం.

అలానే.. కూటమికి నేతృత్వం వహిస్తున్న టీడీపీ కూడా పార్లమెంటులో పైచేయి కోసం ప్రయత్నిస్తోంది. సక్సెస్ కూడా అవుతోంది. అలానే.. ఈ సారి వర్షాకాల సమావేశాల్లో వైసీపీ సభ్యులు పలు ప్రశ్నలు సంధించారు. కానీ, అవి పెద్దగా వర్కవుట్ కాలేదని అంటున్నారు. రాష్ట్రంలో వస్తున్న పెట్టుబడులపై సంధించిన ప్రశ్నకు.. కేంద్రం వాస్తవాలను కుండబద్దలు కొట్టింది. దీంతో వైసీపీకి టీడీపీని విమర్శించే అవకాశం లేకుండా పోయింది. అసలు పెట్టుబడులే రావడం లేదని ప్రచారం చేస్తూ.. వచ్చిన వైసీపీకి పార్లమెంటు వేదికగా సమాధానం వచ్చేసింది.

ఇక, రాజధాని అమరావతి వ్యవహారం కూడా వైసీపీకి ఇబ్బంది పెట్టింది. అమరావతిని ఎప్పటికి పూర్తి చేస్తారు? అ న్న విషయంపై కేంద్రమే సమాధానం ఇచ్చింది. 2028 నాటికి తొలిదశ పూర్తి అవుతుందని వెల్లడించడం గమనా ర్హం. ఇక, పంటలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కూడా ప్రశ్నించిన వైసీపీ.. ఈ విషయంలోనూ ఇరకాటంలో చిక్కుకుంది. పంటలకు దేశవ్యాప్తంగా అమలవుతున్న విధానాలే ఉన్నాయని పేర్కొంది. దీంతో వైసీపీ వేసిన ఎత్తుగడ పారలేదు.

ఇదేసమయంలో వైసీపీకి రాజ్యసభలో షాకులపై షాకులు తగులుతున్నాయన్నది వాస్తవం. యువ ఎంపీ, ఇటీవల రాజ్యసభలో అడుగు పెట్టిన విజయ్.. తన పదునైన వ్యాఖ్యలు, ప్రశ్నలతో వైసీపీని టార్గెట్ చేస్తున్నారు. ఆయన చేసిన కామెంట్లు జగన్‌కు బాగానే తగిలాయని చెప్పాలి. జగన్ కేసులు సహా.. అమరావతి, మావిగన్ అంశాలను ప్రస్తావించిన విజయ్ వైసీపీకి వాయిస్ లేకుండా చేశారు. మరోవైపు.. గతంలో దూకుడుగా వ్యవహరించిన వైసీపీ ఎంపీలు ఈదఫా వెనుకబడ్డారనే చెప్పాలి. టీడీపీ కూటమి ఎంపీలు చాలావ్యూహాత్మకంగా వ్యవ హరించారు. దీంతో వైసీపీ ఈ సారి పైచేయి సాధించలేక పోయింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## కాకినాడలో సంచలన హత్య కేసు ఛేదన..

### ఇద్దరు నిందితుల అరెస్ట్



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లను అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన సిమెంట్ రాయి, కర్రను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించడంతో పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**డబ్బుల విషయంలో వివాదం.. వ్యక్తిపై దాడి**

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 3న కాకినాడ 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యోతుల కాలనీ, తోటమ్మవారివీధిలో డబ్బుల విషయంలో రాజు శివ అనే వ్యక్తికి, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో రాజు శివ తీవ్రంగా గాయపడటంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స కోసం చేర్పించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందంటూ రాజు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే చికిత్స పొందుతున్న రాజు శివ ఈ నెల 6న మృతి చెందడంతో కేసును హత్య కేసుగా మార్చారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాలతో కాకినాడ ఇన్‌చార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

**రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్**

దర్యాప్తులో భాగంగా ఈ నెల 13న సాయంత్రం 5.45 గంటల సమయంలో కాకినాడ 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, సిబ్బంది సహకారంతో నిందితులను పోర్ట్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన సిమెంట్ రాయి, కర్రను స్వాధీనం చేసుకున్నారు.

**నిందితులు వీరే**

కర్నూలు జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన సాయిపోగు కిరణ్మయి అలియాస్ జెస్సీ, రెడ్డిపోగు అజయ్ కుమార్ అలియాస్ పప్పీని నిందితులుగా గుర్తించారు. వీరు కాకినాడలోని జ్యోతుల కాలనీ, తోటమ్మవారివీధి ప్రాంతంలో నివసిస్తూ భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**తీవ్రంగా దాడి చేయడంతో మృతి**

కాకినాడ రాగంపేట రెల్లివీధికి చెందిన రాజు శివ (41) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బాత్‌రూమ్‌లు శుభ్రం చేస్తూ జీవించేవాడని పోలీసులు తెలిపారు. నిందితులతో కలిసి అప్పుడప్పుడు భిక్షాటనకు వెళ్లేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో డబ్బుల విషయంలో జరిగిన గొడవలో నిందితులు రాజు శివపై దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కాళ్లతో తన్నడంతో పాటు చేతులు, కర్ర, సిమెంట్ రాయితో దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడి, రక్తస్రావానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు**

కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన 3 టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్ఐ సాగర్ బాబు, హెడ్ కానిస్టేబుల్స్ పి. పౌలు, ఏ. సతీష్, కానిస్టేబుల్స్ టి. మురళీరాజు, కె. శ్రీనివాస్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**వల్లూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన కడప జిల్లా వల్లూరు మండలంలో చోటు చేసుకుంది. వల్లూరు మండలం బాలు గారిపల్లెకు చెందిన శీలం వెంకట్రాముని కుమారుడు శీలం శ్రీనివాసులు తన అత్తగారి గ్రామమైన చెన్నముక్కపల్లెలో భార్యతో గొడవ పడుతున్న సమయంలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేశారని తెలిపాడు. తనపై దాడిచేసినవారు ఆకమల్ల నాగేంద్ర, పెద్ద రాముడు. ముగెన్న. కట్టబడి సుకుమారి. సుబ్బమ్మ. బేబి. తదితరులు కలిసి దాడి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు శ్రీనివాసులు పేర్కొన్నాడు. అనంతరం తన స్వగ్రామమైన బాలు గారిపల్లెకు చేరుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో అతడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీనివాసులు అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

## పల్నాడు జిల్లాలో వైకాపా నేత హత్య కేసు

### నిందితుల అరెస్ట్

**గురజాల, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన వైకాపా నేత నవులూరి చెన్నారెడ్డి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దాచేపల్లి–మాచర్ల క్రాస్‌రోడ్డులో నిందితులు అశోక్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, పేరిరెడ్డితో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. వారి నుంచి వాహనం, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించగా.. న్యాయస్థానం రిమాండ్ విధించింది. రాజకీయ ఆధిపత్య పోరులో భాగంగానే చెన్నారెడ్డిని ప్రత్యర్థులు హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

## హైదరాబాద్-శ్రీశైలం హైవేపై ప్రమాదం

### ఒకరి మృతి

**రంగారెడ్డి, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్–శ్రీశైలం హైవేపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ వద్ద హైవేపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కిందపడిన శివయాదవ్‌ను వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తాండ్రకు చెందిన శివయాదవ్ అక్కడిక్కడే మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు





కాకినాడ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా









శనివారం, 15 ఆగస్టు, 2026





www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


# గోదావరి పుష్కరాల నాటికి కాకినాడ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ : మంత్రి నారాయణ

**పెద్దాపురం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల నాటికి కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆనూరులో నిర్మాణంలో ఉన్న వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని చెప్పారు. శుక్రవారం ఆనూరు గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత సంస్థ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సేకరించే సుమారు 10 వేల టన్నుల వ్యర్థాలను పునర్వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా తొమ్మిది భారీ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా 2014-19 కాలంలో టోక్యో, సింగపూర్, మలేషియా, రష్యా దేశాల్లో వ్యర్థాల నిర్వహణ విధానాలను అధ్యయనం చేసి వేస్ట్-టు-ఎనర్జీ సాంకేతికతకు శ్రీకారం చుట్టామని చెప్పారు. మున్సిపాలిటీల నుంచి రోజువారీగా వచ్చే సుమారు 7 వేల టన్నుల వ్యర్థాలతో పాటు పంచాయతీల నుంచి సేకరించే వ్యర్థాలను కూడా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం,



గుంటూరులో ప్లాంట్లు అందుబాటులో ఉండగా, కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయనగరం, కాకినాడ జిల్లా పెద్దాపురం ప్రాంతాల్లో ఆరు కొత్త ప్లాంట్లతో పాటు భీమవరం-నరసాపురం ప్రాంతంలో మరో ప్లాంట్ నిర్మాణాన్ని చేపడుతున్నామని వివరించారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా గతంలో పేరుకుపోయిన 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రధాన ప్లాంట్లు పూర్తయ్యే వరకు కొత్తగా సేకరించే వ్యర్థాలు పేరుకుపోకుండా 107 తాత్కాలిక ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా వ్యర్థాలను వేరు చేసి రీసైక్లింగ్, సేంద్రీయ ఎరువుల తయారీ చేపడుతున్నామని చెప్పారు. కాకినాడ జిల్లా ప్లాంట్‌ను రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని చెత్త సమస్యతో పాటు కాలువల నీటి కాలుష్యానికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

**రోజుకు 1,200 టన్నుల వ్యర్థాల వినియోగం**

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా చెత్త రహిత, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రోజుకు సేకరించే సుమారు 1,200 టన్నుల వ్యర్థాలను ఒకే చోటకు చేర్చి విద్యుత్ ఉత్పత్తి చేసే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుగా పెద్దాపురం ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గుంటూరు, విశాఖపట్నంలో జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్లాంట్ల తరహాలో కాకినాడ జిల్లాలోనూ ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి ప్రారంభించేందుకు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్త పేరుకుపోకుండా వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ శాశ్వత పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# రామచంద్రపురంలో ఘనంగా తిరంగా సైకిల్ యాత్ర

## పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముందస్తు సంబరాలు అంబరాన్ని తాకాయి. జగన్నాయకులపాలెం నుంచి ద్రాక్షారామం పంచాయతీ కార్యాలయం వరకు వివిధ పాఠశాలల విద్యార్థులు, కూటమి నాయకులు, ప్రజలతో కలిసి నిర్వహించిన భారీ తిరంగా సైకిల్ ర్యాలీలో మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వయంగా జాతీయ జెండాతో సైకిల్ తొక్కుతూ పాల్గొని యువతలో ఉత్సాహాన్ని నింపారు. "జై హింద్" నినాదాలు, రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలతో ఆ ప్రాంతమంతా దేశభక్తి భావన వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాణత్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన అమరవీరుల త్యాగాలను ప్రతి పౌరుడు స్మరించుకోవాలని, ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, స్వచ్ఛ భారత్ - వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ర్యాలీ మార్గమధ్యంలో మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, ఎంపీడీవో పద్మజ్యోతి, పట్టణ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్, కూటమి పార్టీల నేతలు కొత్తపల్లి శ్రీనుబాబు, ఉండవల్లి శివ, మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, పెంకే సాంబశివరావు, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో డ్వాక్రా మహిళలకు

# స్వయం ఉపాధి అవకాశాలు




**కరప, కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కాలువల్లో పెరిగి నీటి పారుదలకు అడ్డంకిగా మారుతున్న గుర్రపు డెక్కను సంపదగా మార్చి, డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా శిక్షణ అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కరప మండలం గొర్రిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఆర్డీఏ-సెర్ఫ్ ఆధ్వర్యంలో కరప, కాజులూరు మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలకు గుర్రపు డెక్కతో వివిధ కళాకృతులు, బొమ్మల తయారీపై నిర్వహిస్తున్న నెల రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ ప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గుర్రపు డెక్కను ఎండబెట్టి తయారు చేసిన కళా ఉత్పత్తులను పరిశీలించి, మహిళలతో మాట్లాడి శిక్షణ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుర్రపు డెక్కను ఉపయోగించి వివిధ అలంకరణ వస్తువులు, కళాకృతులు తయారు చేయడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసరావు, డీపీఎం టీ. బాబురావు, కరప తహసీల్దార్ లక్ష్మి సరస్వతి, ఎంపీడీవో జె. శ్రీనివాసు, ఏపీఎంలు ఎన్. సత్యనారాయణ, టీ. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు

**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రూ.20 లక్షల నగదు చోరీ కేసులో నిందితుడికి న్యాయస్థానం 7 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రయల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 455/2025, బీఎన్ఎస్ సెక్షన్లు 331(1), 305(ఏ) కేసులో కాకినాడ మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. శ్రీదేవి శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసులో నిందితుడు కాకర లోవరాజు (34), తండ్రి అప్పారావు, సూర్యనారాయణపురం, కాకినాడను దోషిగా నిర్ధారించి 7 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2025 డిసెంబర్ 22 రాత్రి 10.30 గంటల నుంచి డిసెంబర్ 23 ఉదయం 9 గంటల మధ్య కాకినాడ గంజాం వారి వీధిలోని అన్నపూర్ణ మార్కెటింగ్ దుకాణం షట్టర్, తాళాలు పగులగొట్టి సుమారు రూ.20 లక్షల నగదును దొంగిలించారు. దుకాణ యజమాని హితేష్ రాజ్ పురోహిత్ (32) ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2025 డిసెంబర్ 23న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్టు చేసిన పోలీసులు ఆధారాలు సేకరించి దర్యాప్తు పూర్తి చేశారు. అనంతరం నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో విచారణను సమర్థవంతంగా కొనసాగించారు. పోలీసుల దర్యాప్తు, ప్రభుత్వ న్యాయవాది వాదనలతో కేసులో నిందితుడికి శిక్ష పడింది. కేసు ట్రయల్‌ను కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావు పర్యవేక్షించగా, ప్రభుత్వ తరఫున ఏపీపీ కె. సుధారాణి వాదనలు వినిపించారు. కేసు విచారణలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్, కాకినాడ ఇన్‌చార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణ కీలకంగా నిలిచింది. కేసు ట్రయల్‌కు సహకరించిన కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎన్. సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావులను జిల్లా ఎస్పీ అభినందించారు. ట్రయల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తుతో పాటు కోర్టు విచారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పోలీసు అధికారులు తెలిపారు.

# నగల షాప్ చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని ప్రముఖ నగల దుకాణంలో తుపాకీతో బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష పడింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా చేసిన కాకినాడ వన్‌టౌన్ పోలీసులు మరోసారి తమ సమర్థతను చాటారు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 296/2024, బీఎన్ఎస్ సెక్షన్ 309(4) కేసులో కాకినాడ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి డి. శ్రీదేవి శుక్రవారం తీర్పు వెలువరించారు. నిందితుడు నూకల సతీష్ (26), తండ్రి చక్రధరరావు, కందికుప్ప గ్రామం, కాట్రేనికోన మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను దోషిగా నిర్ధారించి ఏడాది సాధారణ జైలు శిక్ష విధించారు.

**తుపాకీతో బెదిరించి నగలు అపహరణ**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2024 డిసెంబర్ 18న మధ్యాహ్నం సుమారు 3.15 గంటలకు కాకినాడ టెంపుల్ స్ట్రీట్‌లోని తానిష్క్ జ్యువెలర్స్‌కు నూకల సతీష్ వెళ్లాడు. సేల్స్‌మ్యాన్ గంటశాల సుబ్రహ్మణ్యాన్ని బంగారు గొలుసులు, నాణేలు చూపించమని కోరాడు. ఆభరణాలు పరిశీలిస్తున్న సమయంలో తుపాకీ చూపించి బెదిరించి ఆరు బంగారు గొలుసులు, రెండు బంగారు నాణేలను అపహరించాడు. మొత్తం 39 గ్రాముల బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.1.95 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా షాపు సిబ్బంది అతడిని వెంబడించి కాకినాడ ఫారెస్ట్ కార్యాలయం సమీపంలో పట్టుకున్నారు. నిందితుడి నుంచి చోరీ సొత్తుతో పాటు తుపాకీ, రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఏపీ 37 డీవీ 0234)ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

**పకడ్బందీ దర్యాప్తుతో శిక్ష**

కేసులో దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కోర్టులో జరిగిన విచారణలో ప్రభుత్వం తరఫున ఏపీపీ శ్రీమతి కె. సుధారాణి వాదనలు వినిపించారు. కేసు ట్రయల్ ప్రక్రియను కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావు పర్యవేక్షించారు. ట్రయల్ కేసుల్లో ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు కేసును పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లారు. కాకినాడ ఇన్‌చార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, కాకినాడ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణ కూడా కేసు విజయవంతంగా ముగియడంలో కీలకంగా నిలిచింది. కేసు ట్రయల్‌కు సహకరించిన కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎన్. సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ ఎం. నాగదుర్గారావులను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.

కాకినాడలో ఘనంగా

# హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్ నిర్వహణ



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా రిహార్సల్స్ నిర్వహించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కాకినాడ జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్ జరిగాయి. అనంతరం ఎస్పీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ భానుగుడి సెంటర్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలో విద్యార్థులు, పోలీసులు "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" అంటూ దేశభక్తి నినాదాలు చేయడంతో ప్రాంతమంతా దేశభక్తి భావంతో మార్మోగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ వందేమాతరం నినాదం, జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ ఏఆర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరిరావు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, సుమారు 1,500 మంది విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.




విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శనివారం, 15 ఆగస్టు 2026
www.viswamvoice.com



ద్రాక్షారామ భీమేశ్వర ఆలయానికి విచ్చేసిన

# అన్నా కొణిదెలకు ఘన స్వాగతం

## ఆలయ మర్యాదలతో ఆహ్వానించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, ఈవో అల్లు వెంకట దుర్గాభవాని




**రామచంద్రపురం, ఆగస్టు 14 (రాజమండ్రి రౌండప్) :** శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సతీమణి శ్రీమతి అన్నా కొణిదెల సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్, ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సుభాష్ ఆలయ మర్యాదలతో అన్నా కొణిదెలను ఆలయంలోకి తీసుకువెళ్లి, శ్రీ మాణిక్యాంబా అమ్మవారు మరియు శ్రీ భీమేశ్వర స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమాల అనంతరం బేడా మండపంలో వేద పండితులు, అర్చకులు శ్రీమతి అన్నా కొణిదెలకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు సంపత్ దంపతుల కుమారుడికి యక్షిత్ ఓంకార్ గా అన్నా కొణిదెల నామకరణం చేసి, పసిబాలుడితో ఆప్యాయంగా ముద్దు చేశారు. దేవస్థానానికి విచ్చేసిన అన్నా కొణిదెలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం మంత్రి వాసంశెట్టి సుభాష్, దేవస్థానం ఈవో శ్రీమతి అల్లు వెంకట దుర్గాభవాని కలిసి పట్టు వస్త్రాలు, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దుర్గాభవాని, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, జనసేన నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాడి మహాలక్ష్మి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం రావులపాలెం గ్రామానికి చెందిన తాడి మహాలక్ష్మి కి సంవత్సరం క్రితం బ్రెస్ట్ కాన్సర్ వచ్చి రెండు ఆపరేషన్ చేయించుకున్నారు. మళ్లీ ఇన్ఫెక్షన్ వచ్చి నెలకి రెండుసార్లు కిమో చేయించుకోవాలని వైద్యులు చెప్పారు. వీళ్ళ ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా 10000 రూపాయలు సంస్థ సభ్యుల చేతుల మీదగా మహాలక్ష్మికి ఇవ్వడం జరిగింది అని దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు.

# ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్ నిలవాలి

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**రావులపాలెం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశం అభివృద్ధిలో మరింత ముందుకు సాగి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలవాలని, స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి గర్వకారణమైన జాతీయ పండుగ అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. నేడు, రేపు, ఎల్లుండి ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగిరేలా చూడాలని ఆయన తెలియజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట ఆలమూరు మండలాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. కొత్తపేట తెలుగుదేశం మండల అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వానపల్లిలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బండారు కృష్ణ సందీప్ పాల్గొన్నారు.దేశ ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మొక్కలు నాటారు అలాగే ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "భస్మం" షార్ట్ ఫిలిం ఫస్ట్ లుక్ పోస్టర్ ఆవిష్కరణ

## సమాజానికి ఉపయోగపడే కథలను ప్రోత్సహించాలి : మంత్రి వాసంశెట్టి సుభాష్




**రామచంద్రపురం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజానికి ఉపయోగపడే సినిమాలు, కథలు రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి చేతుల మీదుగా "భస్మం" షార్ట్ ఫిలిం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ గారు మాట్లాడుతూ "భస్మం" షార్ట్ ఫిలిం కథ సమాజానికి ఉపయోగపడే విధంగా ఉందని, ఇలాంటి మంచి సందేశంతో కూడిన కథలు నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజల్లో ఆలోచనను కలిగించే, సమాజానికి మంచి సందేశాన్ని అందించే కథలను యువత మరింతగా తెరకెక్కించాలని ఆకాంక్షించారు. యువ దర్శకుడు రాజు వనుం మంచి కథాంశాన్ని ఎంచుకుని "భస్మం" షార్ట్ ఫిలింను రూపొందించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. సినిమా రంగంలో యువ ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, రాజు వనుం భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను తెరకెక్కించి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా "భస్మం" షార్ట్ ఫిలిం దర్శకుడు రాజు వనుంను మంత్రి వాసంశెట్టి సుభాష్ గారు ఘనంగా సన్మానించారు. అనంతరం దర్శకుడు రాజు వనుం, చిత్ర బృందాన్ని అభినందిస్తూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. అలాగే "భస్మం" షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్ లక్ష్మీ భావికకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో "భస్మం" షార్ట్ ఫిలిం దర్శకుడు రాజు వనుం, ప్రొడ్యూసర్ లక్ష్మీ భావిక, నటులు వీరు వసంతాల, రావు రాజేష్, శ్రీనివాస్ నరాల, నటరాజ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా

# జనార్ధన స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు



**ఆలమూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రావణమాసంలో మొదటి శనివారం సందర్భంగా ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన మండల కేంద్రమైన ఆలమూరు శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణ ఉంటుందని, ఆలయానికి తరలి వస్తున్న నాలుగు శనివారాల, నాలుగు ప్రదక్షిణల భక్తులతో పాటు అందరికీ తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు తెలిపారు. శ్రావణమాసం తదియ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదమని ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు తెలియజేశారు.

# పశువులకు పశుగ్రాస కొరత రాకుండా చూసుకోవాలి



**ఆలమూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్-నినో ప్రభావం, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు దాణా, నాణ్యమైన పశుగ్రాస సంరక్షణపై రైతులకు మండల పరిధిలోగల మడికి, జొన్నాడ, పెనికేరు, గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్ అనిత, ఆలమూరు పశుసంవర్ధక శాఖ ఏడిఏ బివివి సత్యనారాయణ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎల్-నినో ప్రభావం కారణంగా పశువులకు పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని పశు వైద్యాధికారులకి సూచించారు. గ్రామాల్లో పశువుల ఆరోగ్య రక్షణ, వ్యాధి నివారణ చర్యలపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఇంటింటి సర్వేలో భాగంగా పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారుల వివరాలు సేకరిస్తూ వారికి తగిన సలహాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ భాను ప్రసాద్, డాక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు

# రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక




**రామచంద్రపురం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రీడారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో అమలాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి 'అమరావతి ఛాంపియన్‌షిప్' పోటీల్లో కళాశాల విద్యార్థులు కబడ్డీ, బాస్కెట్‌బాల్, 400 మీటర్ల పరుగు పందెం, 5కే రన్ విభాగాల్లో విశేష ప్రతిభ చాటి తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో శ్రమించి రాష్ట్ర స్థాయిలో కళాశాల పేరును నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ పి. నూకరాజు విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇవ్వడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని, అథ్లెటిక్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన క్రీడాకారులను ఫిజికల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ టి. శ్రీనివాస్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎన్వీ రమణతో పాటు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా అభినందించారు.

పీవైఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

# 7వ మహాసభను జయప్రదం చేయండి

### రాష్ట్ర నాయకుడు బి.సిద్ధు




**రామచంద్రపురం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని కామ్రేడ్ చెలికాని రామారావు స్మారక భవనంలో ఆగస్టు 20న నిర్వహించనున్న ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 7వ మహాసభను విజయవంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బి. సిద్ధు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చింతా రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా సమస్యలు, ఉపాధి అవకాశాల కొరత, నిత్యావసరాల ధరల పెరుగుదల, అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విస్తరణపై యువత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువతలో శాస్త్రీయ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల భావాలను పెంపొందించి, సామాజిక మార్పు కోసం వారిని సంఘటితం చేయడమే పీవైఎల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఉద్దేశించిన ఈ మహాసభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు వానపల్లి నాగరాజు, శివ, ఎస్.కె. కమల్ బాషా, కటకం రవి, ఉత్తరాల హరి తదితరులు పాల్గొన్నారు.

బడుగువానిలంక విద్యార్థులకు

# తూర్పుగోదావరి జిల్లా కలక్టర్ కీర్తి చేకూరి అభినందనలు



**ఆలమూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో బడుగువానిలంక గ్రామానికి చెందిన ఇరువురు విద్యార్థినిలను తూర్పుగోదావరి జిల్లా కలక్టర్ కీర్తి చేకూరి అభినందించారు బడుగువాని లంక గ్రామ ఎంపిటీసి పడాల అమ్మిరాజు నాగలక్ష్మి కుమార్తె వర్షిని,అలాగే కర్రి జనార్ధన్ సత్య కుమార్తె వైష్ణవి లు తమిళనాడు జానపద నృత్యం "కుమ్మి కోలాటం" వీరు విశేష ప్రతిభ కనబరిచారు.గత నెల 26న హైదరాబాదు రాష్ట్రపతి భవనంలో జరిగిన పోటీలలో వీరు ప్రతిభ కనబరచి డిల్లీ లో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ధవళేశ్వరం శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రంలఖ వీరు శిక్షణ పొందుతున్నారు. ఆ కాళా క్షేత్రం ద్వారా ఎంపికైన విద్యార్థులను జిల్లా కలక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందించారు. ఇటువంటి కళా నృత్యాలలో విద్యార్థులు రాణించాలని కలక్టర్ సూచించారు.



### కాకినాడ జిల్లా సమక్ష సమావేశంలో

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

## పెండింగ్ అంశాల సత్వర పరిష్కారానికి చర్యలు : జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసి, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ (డి.ఆర్.సి) సమావేశం అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి పి. నారాయణ.. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య; ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ అర్బన్, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులతో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను మంత్రి పి నారాయణ ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులకు వివరించారు. జిల్లా సమీక్షా సమావేశంలో ప్రజా సమస్యలపై అధికారులు, శాసనసభ్యులు వివిధ అంశాలపై సానుకూలంగా స్పందించారని జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ మీడియా సమావేశంలో వెల్లడించారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ సమావేశంలో కూలంకషంగా సమీక్షించినట్లు ఆయన తెలిపారు.

**వ్యవసాయ ఇన్సూరెన్స్, గృహ నిర్మాణ సమస్యలు:**

రైతుల పంటల ఇన్సూరెన్స్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, దీనిని పొడిగించాలని గౌరవ ప్రజాప్రతినిధులు కోరడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి గడువు పొడిగింపునకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో కేవలం కాగితాలు ఇచ్చి సరైన స్థలాలు కేటాయించని అవకతవకలపై గత రెండు సంవత్సరాలుగా తీవ్ర కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు.ఆర్ డి ఓ స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలు వేసి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి 15 రోజుల్లోగా తగిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు తెలిపారు.

**నూతన అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, రాజీవ్ గృహకల్ప సముదాయాలు మరమ్మతులు:**

పేదలకు కేవలం ఐదు రూపాయలకే అన్నం పెట్టిన అన్నా క్యాంటీన్లను మొదటి వంద రోజుల్లోనే వాటిని పునరుద్ధరించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ప్రజల డిమాండ్ మేరకు మరిన్ని కొత్త అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలుతీసుకుంటామన్నారు. దెబ్బతిన్న రాజీవ్ గృహకల్ప భవనాల మరమ్మతులపై ముఖ్యమంత్రితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఓఎన్జీసీ ప్రమాద బాధితులకు, పిఠాపురంలో విద్యుత్ లైన్ల సవరణకు సత్వర సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

**పీఎం సూర్యఘర్ పథకం, వైద్య సేవలు అందుబాటులోకి:**

సూర్యఘర్ పథకం అమలులో కాకినాడ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని, దీనిని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా వర్తింప జేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళాలని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కోరారని న్నారు. కాకినాడ జీజీహెచ్ లో అత్యవసరంగా కార్డియాలజిస్ట్ నియామకం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జీతాలు పెంచయినా సేవలు అందుబాటులోకి తెచ్చేలా జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తాగునీటి వనరుల సంరక్షణ, ఎల్ నినో ప్రభావం:**

ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం దృష్ట్యా తాగునీటి భద్రత అత్యంత కీలకమని, దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులకు నిరంతరం తగు సూచనలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. డీఆర్సీ సమావేశంలో భాగంగా జిల్లాలోని దాదాపు 63 నీటి ట్యాంకులను గ్రావిటీ ద్వారా నీటితో నింపే అంశంపై చర్చించామని, దీనిపై పూర్తిస్థాయిలో పరిశోధన చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు మంత్రి పి. నారాయణ మీడియాకు వివరించారు.

### కాకరాపల్లి శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో

# శ్రావణమాసం వేడుకలు



**కోటనందూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, కాకరాపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం వేడుకలు ప్రారంభమైనవి. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో అమ్మవారికి పంచామృతాభిషేకములు, అలంకరణ, హారతి అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అనేకమంది మహిళలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈరోజు అమ్మవారిని ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, అధికారులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరముల నుండి ఈ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఈరోజు కూడా అమ్మవారికి జరగవలసిన అన్ని పూజా కార్యక్రమాలు యధావిధిగా జరిగాయని, ఈ శ్రావణమాసంలో అమ్మవారిని పూజించడం వలన అష్టైశ్వర్యాలు, పాడిపంటలు, సుఖసంతోషాలు, ఉద్యోగ వ్యాపారాలు లభిస్తాయని తెలియజేస్తూ, ఈ గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాలు కూడా సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి వెంకటనారాయణ, పిఎన్ఆర్ ఇన్ఫ్రా పెనుముచ్చు నర్సింగరావు, సామినీడి కృష్ణార్జున, తదితరులు పాల్గొన్నారు.

### భావితరాలకు దేశభక్తిని పెంపొందించడం కోసమే

# జాతీయ జెండా ర్యాలీ

**యువత దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి**

**అతిథిగా అల్లూరి సీతారామరాజు మనవడు శ్రీరామరాజు**

**అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ కోటనందూరు**





**కోటనందూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** భావితరాలకు దేశభక్తిని పెంపొందించడం కోసమే జాతీయ జెండా ర్యాలీ నిర్వహించామని అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ సభ్యులు తెలియజేశారు. కాకినాడ జిల్లా, కోటనందూరులో 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించు కొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ సభ్యులు కలిసి 375 అడుగుల భారీ జాతీయ జెండాను హైస్కూల్ నుండి కోటనందూరు బస్టాండ్ అక్కడి నుండి శివాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మన్యం వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మనవడు శ్రీరామరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ గత 4 సంవత్సరాల నుండి జెండా ర్యాలీ నిర్వహిస్తున్నారని, ఎందరో త్యాగమూర్తుల త్యాగం, వారు కృషి ఫలితమే ఈ స్వాతంత్రం లభించిందని, స్వాతంత్రం సంపాదించిన వీరులను స్మరించుకొని వారి స్ఫూర్తితో నడవాలని, దేశ సమైక్యత సమగ్రత ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో ప్రతి పౌరుడు బాధ్యత కలిగి ఉండాలని, యువత మద్యానికి, గంజాయికి, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి సేవాభావం కలిగి, తోటి వారికి సమాజానికి సేవ చేసిన నాడే నిజమైన స్వాతంత్రం అని తెలియజేశారు. స్వాతంత్ర సమరయోధుల ఆశయాలు సాధన కోసం మనం ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కే ఎస్ వి సత్యనారాయణ, అధ్యాపక బృందం, అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ వ్యవస్థాపకుడు లక్కాకుల బాబ్జి, దాడి గోవిందరావు మాస్టారు, తోలెం సత్తిబాబు, అనకాపల్లి వెంకటరమణ, దాడి లోవరాజు, చప్పా లోవరాజు, సాంబారు ప్రసాద్, గజ్జలపు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లిపూడిలో ఇంటింటా తెలుగుదేశం

# కార్యక్రమంలో ఎమ్మెల్యే దివ్య



**కోటనందూరు, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రెండేళ్ళ నమ్మకం,, కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల విజయాలపై ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇవాళ కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, అల్లిపూడిలో ఎమ్మెల్యే యనమల దివ్య పర్యటించారు. సీనియర్ నేత గాడి రాజబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి యనమల దివ్య హాజరయ్యారు.శ్రావణమాసం తొలి శుక్రవారం శ్రావణ లక్ష్మిని తోడ్కొని వచ్చి యనమల దివ్యను ఇంటి ఆడపడుచు లాంఛనాలతో మహిళలు తాంబూలం ఇచ్చి ఆమెపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక నాయకులు అంకంరెడ్డి బుల్లిబాబు,రుత్తల శ్రీనివాస్,రుత్తల సత్య సీతయ్య, అంకంరెడ్డి గోపీ,బోలెం నూకరాజు ,చింతకాయల కొండబాబు, చింతకాయల సురేష్ తదితరులతో ఇంటింటికీ వెళ్ళిన ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ రెండేళ్ళలో జరిగిన గ్రామాభివృద్ధిని వివరించిన ఆమె సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసారు.అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం వంటి పథకాలపై ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే సరిచేసి అర్హత కలిగిన వారికి ఆర్థిక ప్రయోజనం కల్పిస్తామన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ దళిత నేతలు నెమ్మాది సత్యనారాయణ, ముప్పిడి జమీలు,దుత్తుర్తి జ్యోతి,లంక ధనాజీ, కాపారపు నాని, కచ్చా చెల్లయ్య, మండల నాయకులు పెంటకోట భాస్కర సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, పెనుముచ్చు నాగేశ్వరరావు దంతులూరి చిరంజీవి రాజు, డాక్టర్ వెలగా వెంకట కృష్ణారావు, వాసు నాగేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున, బైలపూడి శ్రీరామ్మూర్తి, పెనుముచ్చు ప్రవీణ్, బర్ల నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో ఘనంగా ఎన్‌సీసీ ఫ్లాగ్ ర్యాలీ




**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ 18(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలో ఫ్లాగ్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భానుగుడి సెంటర్ నుంచి బోటు క్లబ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా సాగింది. 18(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్ మెనెజెస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిఫ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆర్మీ, నేవల్, ఎయిర్ వింగ్‌లకు చెందిన సుమారు 250 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. క్యాడెట్లు చేతుల్లో మువ్వన్నెల జాతీయ జెండాలను పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్నల్ అజయ్ మెనెజెస్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం వేలాది మంది సమరయోధుల పోరాటం, ధైర్యం, త్యాగాల ఫలితమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని బలమైన, సమైక్య, ప్రగతిశీల భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీ ప్రధాన ఆదర్శమైన లి"సమైక్యత మరియు క్రమశిక్షణ"లికు కట్టుబడి, పూర్తి అంకితభావం, బాధ్యతతో దేశసేవలో ముందుంటామని క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని చాటిన ఈ ఫ్లాగ్ ర్యాలీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనమైన నాంది పలికింది. కార్యక్రమంలో పలువురు ఎన్‌సీసీ క్యాడెట్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

### కరపలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై

# కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు



**కరప, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను అత్యంత పకడ్బందీగా విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని కరప మండలం చంద్రన్న సమావేశ మందిరంలో శుక్రవారం 'ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు' కార్యక్రమం రెండో వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి. వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి, నాలుగు శుక్రవారాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 'ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత వారం అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పూర్తి స్థాయి విచారణ చేపట్టి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. రెండో వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సుమారు 43 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా భూవివాదాలు, రీసర్వేలో తలెత్తిన సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, రహదారులు, తాగునీటికి సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి సమస్యపై అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ప్రజల సమస్యలకు అనుకూలమైన పరిష్కారం చూపేలా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గత వారం, ఈ వారం అందిన అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు పూర్తి స్థాయి పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరప తహసీల్దార్ లక్ష్మీ సరస్వతి, ఎంపీడీవో జె. శ్రీనివాసు, నియోజకవర్గ, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరపలో 'వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్'



**కరప, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలను అత్యంత పకడ్బందీగా పరిష్కరించడమే లక్ష్యంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న లి'వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్'లిలి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం కరప మండలంలో పర్యటించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో వరుసగా రెండో వారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు నాలుగు వారాల పాటు ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలులి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరప మండలం ఎంపీడీవో కార్యాలయంలో లిహర్ ఘర్ తిరంగాలి కార్యక్రమంలో భాగంగా వీబీజీ రామ్ జీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీడీవో పి.వాసుదేవరావు, కరప తహసీల్దార్ లక్ష్మి సరస్వతి, ఎంపీడీవో జె. శ్రీనివాసు, కాకినాడ రూరల్ నియోజకవర్గం, కాకినాడ డివిజన్, కరప మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కరప మండల ప్రజలు లి'వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్'లి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు.

# కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన జేసీ అపూర్వ భరత్



**కాకినాడ, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కోరారు.





# డంపింగ్ యార్డు రహిత రాష్ట్రమే లక్ష్యం

**ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ**
**వ్యర్థాల నిర్వహణలో ప్రజల చైతన్యం ఎంతో ముఖ్యం : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**
**కంపోస్ట్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ : :** రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా మార్చేందుకు వినూత్న విధానాలను అనుసరిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ లతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయకపోతే.. టన్నుల కొద్దీ పేరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను వదిలేసి వెళ్లిందని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త ఉండగా.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఏడాది కాలంలోనే ఆ చెత్తనంతా ప్రాసెస్ చేసినట్లు వెల్లడించారు. భూగర్భంలో మరో 156 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ఉన్నట్లు అంచనా వేయగా.. ఆ వేస్ట్ ను కూడా అక్టోబర్ 2 నాటికి ప్రాసెస్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రాసెస్ చేసిన ఆర్‌డీఎఫ్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తామని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో ఘన వ్యర్థాల నిర్వహణకు అభివృద్ధి చెందిన దేశాలలో అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 10 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ద్వారా వేస్ట్ ను బర్న్ చేయడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. కానీ గత ప్రభుత్వం అవగాహన లేక 8 ప్లాంట్లను రద్దు చేసినట్లు మండిపడ్డారు. చైనాలో ఇటువంటి ప్లాంట్లు 1,100 ఉండగా జపాన్ లో వెయ్యి., సింగపూర్ లో 7 ఉన్నాయన్నారు. కానీ గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో వ్యవహరించిందన్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురం కలిపి ఆరు 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెద్దాపురంలో ప్లాంట్ నిర్మాణం అడ్వాన్డ్ స్టేజీలో ఉండగా, మరో సంవత్సరం 3 నెలల కాలంలో పూర్తవు తుందన్నారు. పర్యటనలో కమిషనర్ రాహుల్ మీనా, అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈ మాధవి, ఇతర నగరపాలక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# హరిత రాజమహేంద్రవరం దిశగా మరో ముందడుగు

**నగరవ్యాప్తంగా రూ.58.90 లక్షలతో మొక్కల పెంపకం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 14 విశ్వం వాయిస్ న్యూస్ : :** నగరాన్ని మరింత పచ్చగా, ఆహ్లాద కరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆరోగ్యకరమైన, పర్యావరణహితమైన వాతావరణాన్ని ప్రజలకు అందించ డమే లక్ష్యంగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమా లను చేపట్టారు. హరితాంధ్ర-2026లో భాగంగా శుక్రవారం వి.ఎల్.పురం టెన్నిస్ కోర్టు వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి అంటే కేవలం రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణం మాత్రమే కాదని, నగరానికి పచ్చదనం కూడా అంతే ముఖ్యమని అన్నారు. నగరవ్యాప్తంగా సుమారు రూ.49 లక్షలతో రోడ్డు సెంట్రల్ మీడియన్లలో గ్యాప్ ఫిల్లింగ్, మొక్కల పెంపకం పనులు చేపట్టగా, మరో రూ.9.90 లక్షలతో రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా నగరంలో పచ్చదనాన్ని విస్తరించడంతో పాటు రహదారుల అందాన్ని పెంచే చర్యలు చేపడుతున్నామన్నారు. హరితాంధ్రప్రదేశ్ లక్ష్యానికి అనుగుణంగా రాజమహేంద్రవరం నగర పరిధిలో రోడ్డు మీడియన్లు, మున్సిపల్ పాఠశాలలు, ఎస్టీపీ ప్రాంతం, డంపింగ్ యార్డు, ఆరోగ్య కేంద్రాలు, వివిధ రహదారుల వెంట పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారని వివరించారు. గెయిల్ రోడ్, గ్లో గార్డెన్ రోడ్, మోడల్ కాలనీ రోడ్, లాలాచెరువు స్కూల్ రోడ్, భాస్కర్ నగర్ అంతర్గత రహదారులు తదితర ప్రాంతాల్లో కూడా ప్లాంటేషన్ చేపట్టారని తెలిపారు. 2026-27లో చేపట్టిన ప్లాంటేషన్ వివరాల ప్రకారం లాలాచెరువులో 150, గెయిల్ ఆఫీస్ రోడ్డులో 140, మోడల్ కాలనీలో 120, గ్లో గార్డెన్‌లో 70, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 200, ఎస్టీపీ ప్రాంతంలో 200, ఆర్ఎంసీ డంపింగ్ యార్డులో 50, సీటీఆర్ఐలో 200, అవా ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో 150, ఫ్రష్ ఏరియాలో 3,200, రోడ్డు సెంట్రల్ మీడియన్లలో 250 మొక్కలు నాటినట్లు మున్సిపల్ కార్పొరేషన్ వివరాలు వెల్లడిస్తున్నాయ న్నారు. మొత్తంగా 4,730 మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్కరి ఓటు రద్దు కాకూడదు

**ఓటర్ జాబితా పై ప్రత్యేక దృష్టి సారించండి : ఎమ్మెల్సీ తోట**



**మండపేట టౌన్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితా ముసాయిదా సిద్ధమైన నేపథ్యంలో అర్హతలు ఉన్న ఒక్క ఓటు కూడా రద్దు కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ చూడాలని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట పట్టణ బిఎల్ఏలు, వైసీపీ నాయకులతో మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్ ముసాయిదాలో జరిగిన ఓట్ల తొలగింపు పై ప్రత్యేక చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఈ ముసాయిదా కు సంబంధించి ఓటర్ జాబితా పై ప్రత్యేక దృష్టిసారించి ఏమైనా ఇబ్బందులు ఉంటే బూత్ మండల లెవెల్ ఇన్చార్జిలకు తో చర్చించాలన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ముసాయిదాపై అభ్యంతరాలు ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్సీ తోట తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ముసాయిదా విడుదల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధిష్టానం నేతలు దిద్దుబాటు చర్యలపై సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ముసాయిదా జాబితా పరిశీలనపై పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశామన్నారు. ఓటర్ల జాబితా సవరణ ముసాయిదాపై వార్డు వారిగా వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తో సమీక్ష చేశామని వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో తప్పులను గుర్తిచి అభ్యంతరాలు తెలపాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గాల వారీగా ముసాయిదా జాబితాలను పరిశీలించేందుకు నాయకులకు బాధ్యతలు అప్పగించారు.ఈ కార్యక్రమం లో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సీతానగరంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**సీతానగరం, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయము నుండి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కలసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి ప్రారంభించి ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జెండా ఆవిష్కరణ చేసి దేశభక్తిని చాటాలని జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాలని అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

**బీసీ బాలికల హాస్టల్‌లో**

# పోలీసుల అవగాహన సదస్సు



**మండపేట టౌన్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండపేట ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం లో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, మండపేట టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బి.విద్య మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - పోక్సో చట్టం వివరించారు. మహిళలపై జరిగే నేరాలు, వాటి నుండి రక్షణ పొందే మార్గాలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, 1098, 100, 112 హెల్ప్‌లైన్ నెంబర్ల వినియోగం గురించి విద్యార్థినులకు వివరించారు. యువతకు కెరీర్ గైడెన్స్ అందించారు. విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి, చదువుతో పాటు పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి అనే అంశాలపై సూచనలు ఇచ్చారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో బిసి బాలికల వసతి గృహం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సిబ్బంది సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ సందేహాలను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట టౌన్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం మండపేట పట్టణంలోని స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన వందలాది మంది ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సమస్యలపై మొత్తం 104 అర్జీలు వచ్చాయి. ఇందులో హౌసింగ్ లోన్ కు సంబంధించి 28, ఇళ్ల స్థలాల కోసం 22, రెవెన్యూ సమస్యలు 11, ఎడ్యుకేషన్ 5, నేతన్న సేవలో 5, ఎలక్ట్రికల్ 3, రోడ్లు, డ్రైన్లు 3, ఇరిగేషన్ 2, ఇతర సమస్యలకు సంబంధించి 25 అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలు స్వీకరిస్తున్న సమయంలో ఏడిద గ్రామానికి చెందిన దివ్యాంగురాలు తన సమస్యను చెప్పుకునేందుకు వచ్చి, లోపలికి రాలేక వెలుపలే ఆటోలో ఉండి ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వెంటనే స్పందించి స్వయంగా ఆమె వద్దకే వెళ్ళారు. ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకుని, అర్జీని స్వీకరించారు. తప్పకుండా సమస్య పరిష్కరిస్తా అని ఎమ్మెల్యే ఆమెకు చెప్పారు. బాధితులు విన్నవించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడి కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపి, బాధ్యతాయుతంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ వేదికలను నిర్వహిస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# బ్రిటిష్ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం

**ఎనభై ఏళ్ల స్వాతంత్ర రాజ్యం : ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు**
**పుర పాలక సంఘం ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ - ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు**



**మండపేట టౌన్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వేచ్ఛ స్వతంత్ర భారత్ లో ప్రతి పౌరుడు గౌరవంగా తలెత్తుకునే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. నియంతృత్వ పోకడ కు దూరం ప్రతి ఒక్కరు ప్రజాస్వామ్య దేశంలో హాయిగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. బ్రిటిష్ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుల త్యాగ ఫలితమే ఎనభై ఏళ్ల స్వాతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. మండపేట పుర పాలక సంఘం ఆధ్వర్యంలో ముందస్తు స్వాతంత్ర దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ టీవీ రంగారావు ఏర్పాటు చేసిన భారీ తిరంగా ను ఊరేగించారు. ఈ ర్యాలీ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత మండపేట మునిసిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు జెండా ఊపి 500 అడుగుల అతి పెద్ద జాతీయ పతాక ర్యాలీ ఆరంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. స్వతంత్ర ఉద్యమం జరిగిన విధానాన్ని తెలుసుకోవాలన్నారు. శాంతి యుతంగా మహాత్మా గాంధీ బాట లో ఎందరో మహనీయులు ఈ పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. దేశ ప్రగతి కి ఎన్ డి ఏ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. విద్యార్దులలో జాతీయ భావం, ఐక్యత, దేశ భక్తి పెంపోందించేందుకు ఆగష్టు 15 నాడు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసేందుకు హర ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మత్తు పదార్దాలు విడనాడాలని దేశ అభ్యున్నతికి పాటు పడాలని భారతీయలంతా ఒక్కటే అని భారతఖ్యాతిని ప్రపంచ దేశాలలో ఉత్తమ స్దానం సాధించుటలో యువత ప్రధానపాత్ర పోషించాలని పేర్కొన్నారు. రాబోయే దేశ భవిష్యత్తు అంతా యువతీపై ఆధారపడి ఉంటుందని యువతకు సందేశాన్ని దిశానిర్దేశం చేశారు. మండపేట మున్సిపాల్టీ నుండి మండపేట కేపీ రోడ్ రథం సెంటర్ వరకు ఈ భారీ జాతీయ జెండా ఉండటం విశేషం. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్ టీవీ రంగారావు, మండపేట టౌన్ సి ఐ సురేష్, డీ ఈ కే శ్రీనివాస్, మునిసిపల్ ఏ ఇ అనూష లక్ష్మీ, ఆర్ ఓ మాచిరాజు రవి,ఆర్ ఐ కొత్తపల్లి సత్తిబాబు,మెప్మా సి ఎం ఎం సుజాత, మెప్మా సి ఓ రాంజీ, బి వీర లక్ష్మీ, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మేనేజర్ శ్రీనివాస్, స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్,ఆర్ లక్ష్మీప్రసన్న, జె ఓ ఎం సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి కడియాల శ్రీ రమ్య, బీజేపీ సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ , వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



**మండపేట టౌన్, ఆగస్టు 14, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశభక్తిని చాటేందుకు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ జాతీయ పతాకాలను చేతబూని, దేశభక్తి గీతాలను ఆలపిస్తూ కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో, ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత బలపడతాయని అన్నారు. విద్యార్థులు దేశభక్తితో బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు డాక్టర్ నేమాని కిరణ్ కుమార్, సురేష్, చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శివతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




సినీ వాయిస్ CINE VOICE



# అందం ఫుల్లు అవకాశాలు నిల్లు..

## ఈ అమ్మడికి ఆఫర్స్ రావడం లేదా..?

ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. ఆమె అంటే కుర్రకారు పడిచచ్చిపోతారు. చేసింది తక్కువ సినిమాలే అయినా విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. నిజం చెప్పాలంటే సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సెషన్ అయ్యింది. ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. ఆమె అంటే కుర్రకారు పడిచచ్చిపోతారు. చేసింది తక్కువ సినిమాలే అయినా విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. నిజం చెప్పాలంటే సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సెషన్ అయ్యింది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. తనే నేహా శెట్టి. యంగ్ హీరో సిద్దూ జొన్నలగడ్డ నటించిన డిజే టిల్లు సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో ఒక్కసారిగా గ్లామర్ క్రేజ్ సంపాదించుకుంది. డీజే టిల్లు తర్వాత నేహాకు తెలుగు ప్రేక్షకుల నుంచి ఓ రేంజ్ క్రేజ్ వచ్చేసింది. దీంతో టాలీవుడ్ ఇండస్ట్రీలో నేహాకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. మాస్ కా దాస్ విశ్వక్ దాస్ హీరోగా నటించిన గ్యాంగ్ ఆఫ్ గోదావరి చిత్రంలో కనిపించింది. హీరో కార్తికేయ జోడిగా బెదురులంక 2012 చిత్రంలో నటించింది. అయితే అందమెంత ఉన్న ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ స్టార్ డమ్ మాత్రం రాలేదు. కానీ ఈ బ్యూటీ క్రేజ్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. స్టార్ హీరోయిన్ కు మించి పాపులారిటీ సొంతం చేసుకుంది. ఓవైపు సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఇటీవలే మరోసారి టిల్లు స్క్వేర్ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు. అందంతో కవ్వించిన ఆశించినస్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. కానీ సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే రచ్చ గురించి చెప్పక్కర్లేదు. నిత్యం లేటేస్ట్ గ్లామర్ ఫోటోషూట్లతో ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

### శ్రీహరి జయంతి .. కుమారుడు మేఘాంశ్ శ్రీహరి

# కొత్త సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్



రియల్ స్టార్ శ్రీహరి వారసత్వాన్ని కొనసాగిస్తూ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు ఆయన తనయుడు మేఘాంశ్ శ్రీహరి. రాజ్ దూత్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన మేఘాంశ్ ఆ తర్వాత కోతికొమ్మచ్చి అనే సినిమాలోనూ యాక్ట్ చేశాడు. ఇప్పుడు మరో కొత్త సినిమాతో ఆడియెన్స్ ముందుకు రానున్నాడు మేఘాంశ్. నటుడిగా ఎన్నో విభిన్నమైన పాత్రలు, వైవిధ్యమైన సినిమాలు చేసి తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేకస్థానాన్ని సంపాందించుకున్న లెజెండరీ నటుడు రియల్‌స్టార్ డా. శ్రీహరి. ఇప్పుడు ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ నటుడిగా కెరీర్‌ను ప్రారంభించిన మేఘాంశ్ శ్రీహరి హీరోగా భైరవకాళి బ్యానర్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. లెల్లా రోహిత్ దర్శకత్వంలో లెల్లా రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిలో బాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న హీరో ఫస్ట్ లుక్ నీ ఆగస్టు 15న (రేపు) శ్రీ హరి గారి పుట్టిన రోజు సందర్బంగా ఇవాళ (ఆగస్టు 14) చిత్ర బృందం విడుదల చేసింది. ఈ లుక్‌లో తనయుడు మేఘాంశ్ శ్రీహరికి అండగా వెనుక పోతురాజు ఆహార్యంలో రియల్‌స్టార్ డా. శ్రీహరికి కూడా కనిపిస్తుండటంతో ఈ లుక్ మరింత పవర్‌ఫుల్‌గా మారింది. ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, శరవేగంగా ముస్తాబవుతోంది, త్వరలో చిత్ర బృందం ఇండియాస్ బిగ్గెస్ట్ టైటిల్ గ్లింప్స్ రివీలింగ్ ఈవెంట్ జరగబోతుందని ప్రకటించింది. ఈ ఈవెంట్ ద్వారా సినిమాలో హీరోకు సంబంధించిన ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నారు. మిగిలిన వివరాలు త్వరలో ప్రకటించబడతాయని చిత్ర బృందం తెలిపింది. మేఘాంశ్ శ్రీహరి చేతిలో ప్రస్తుతం ఈ సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఉన్నాయి. ఇటీవలే అతను హీరోగా నటించిన స్టూడెంట్ అనే సినిమా టీజర్ కూడా రిలీజ్ అయ్యింది. అలాగే ఆస్మాన్ అనే ఓ కొత్త సినిమా ఓపెనింగ్ కూడా జరిగింది. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు సెట్స్ పై ఉండగానే మరో కొత్త సినిమాను ప్రకటించాడు మేఘాంశ్. త్వరలోనే ఈ సినిమాలకు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

# ఆరో నంబర్ అలర్ట్.. వచ్చి అదరగొట్టేదెవరు?



శ్రీలంకతో తొలి టెస్టు కోసం బరిలోకి దిగే టీమ్ఇండియా ప్లేయింగ్ XIలో ఒక్కటి మినహా అన్ని ప్లేస్‌లు దాదాపు ఖరారే. అదొక్కటే ఆసక్తికరంగా మారింది. అదేంటీ? అక్కడ ఎవరి మధ్య పోటీ? ఆ ప్లేస్‌కి ఎవరైతే సెట్ అవుతారనేది ఓ లుక్కేద్దాం.. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే టీమ్ఇండియాకు టెస్టు సిరీస్ అత్యంత కీలకం. అందుకోసం అన్ని అస్త్రాలతో శుభ్‌మన్ సేన రంగంలోకి దిగాలి. స్పిన్‌కు సహకరించే పిచ్‌లపై జట్టు కూర్పు కూడా ఎంతో కీలకమే. ప్రస్తుతం టీమ్ఇండియా ముందున్న సవాల్ కూడా అదే. రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూర్య, సోనాల్ దినుషతో కూడిన శ్రీలంక స్పిన్ ఎటాక్‌ను ఎదుర్కోవాలంటే భారత బ్యాటింగ్ కూడా లోతుగానే ఉండాలి.

**ఇదీ బ్యాటింగ్ లైనప్**

ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్ - కేఎల్ రాహుల్ బరిలోకి దిగడం ఖాయం.

సాయి సుదర్శన్ గాయపడటంతో వార్మప్ మ్యాచ్‌లో సెంచరీ బాదిన దేవదత్ పడిక్కల్ ఎలాగూ మూడో స్థానంలో వచ్చేస్తాడు.

సెకండ్ డౌన్ లేదా నాలుగో స్థానం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌దే.

ఐదో ప్లేస్‌లో ఆడేందుకు డ్యాషింగ్ బ్యాటర్ రిషభ్ పంత్ ఉండనే ఉన్నాడు. టెస్టుల్లోనూ వీరబాదుడు అతడి స్పెషాలిటీ.

ఏడో స్థానంలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడతాడు.

ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్ కూడా పరుగులు రాబట్టగలమని నిరూపించారు. వార్మప్‌లో చూశాం కదా!

పదో బ్యాటర్‌గా స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ తుది జట్టులో ఖాయం.

ప్రధాన పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఖరి బ్యాటర్‌గా వస్తాడు.

**ఆ ఇద్దరిలోనే పోటీ..**

పైన నిశితంగా గమనిస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక ప్లేస్‌మెంట్ కనిపించదు. అదేంటో తెలుసా? అదే ఆరో స్థానం. ముఖ్యంగా సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లో తుది జట్టులోకి ఎవరిని తీసుకోవాలన్నదానిపై చర్చ నడుస్తోంది. గత కొన్ని టెస్టు ఇన్నింగ్స్‌ల్లో పెద్దగా ఆకట్టుకోని ధ్రువ్ జురేల్ వైపే జట్టు యాజమాన్యం మొగ్గు చూపిస్తోందని వార్తలు వస్తున్నాయి. అయితే.. అతడి స్థానంలో సర్ఫరాజ్‌ను తీసుకోవాలని పలువురు మాజీలు సూచిస్తున్నారు. ఈ నిర్ణయంతో మిడిలార్డర్ బలోపేతమవుతుందని అంచనా వేస్తున్నారు. సర్ఫరాజ్ చాన్నాళ్ల తర్వాత జట్టులోకి వచ్చాడు. స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. స్వీప్ షాట్లతో పరుగులు రాబడతాడని మాజీలు చెబుతున్నారు. గాలె పిచ్ ఎలాగూ స్పిన్నర్లకు స్వర్గధామం. వారి లెంగ్త్‌ను దెబ్బతీయాలంటే సర్ఫరాజ్‌లాంటి బ్యాటర్ అవసరమనేది వారి వాదన.

**ఫామ్‌లో లేని ధ్రువ్..**

మరోవైపు, ఈ రేసులో ఉన్న ధ్రువ్ జురెల్ బ్యాటింగ్ ఫామ్ కూడా అంత గొప్పగా ఏమీలేదు. వార్మప్ మ్యాచ్‌లోనూ చాలా ఇబ్బంది పడ్డాడు. గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో జురెల్ చేసిన పరుగులు 98 మాత్రమే. అదీనూ 16.33 సగటుతో కావడం గమనార్హం. స్పిన్‌ను ఆడటంలోనూ సర్ఫరాజ్‌తో పోలిస్తే జురెల్ కాస్త వెనుకే ఉంటాడు. టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ కూడా స్పిన్‌ను సమర్థంగా ఆడగల బ్యాటర్‌కే అవకాశం ఇస్తామని స్పష్టమైన సంకేతాలు పంపింది. అందుకే, సర్ఫరాజ్‌కు అవకాశాలు మెండుగా ఉన్నాయనేది క్రీడా పండితుల అంచనా.

**తుది జట్టు (అంచనా):** యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్‌దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, సిరాజ్

క్రీడా వాయిస్ – మీ క్రీడా వార్తల స్వరము

# ఇదే నా చివరి ప్రపంచ కప్ కావచ్చు : మన్‌ప్రీత్ సింగ్



ఆగస్టు 15 నుంచే హాకీ ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఇందులో భారత్‌ను చివరిసారిగా 1975లో స్వర్ణం వరించింది. ఆ తర్వాత పతకం రాలేదు. ఈసారి ఎలాగైనా ఆ లోటును భర్తీ చేయాలనే లక్ష్యంతో టీమ్ఇండియా బరిలోకి దిగుతోంది. తనకు ఇదే చివరి ప్రపంచ కప్ కావచ్చని సీనియర్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించాడు. అదే దృక్పథంతో బరిలోకి దిగి గెలిచేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు. "ఈ వరల్డ్ కప్ నాకెంతో స్పెషల్. ఇది నాకు నాలుగో ఎడిషన్. మేం ఒలింపిక్ మెడల్స్ గెలిచాం. కానీ, వరల్డ్ కప్‌లో పతకం అందుకోలేకపోయాం. ఇప్పుడున్న జట్టులో ప్రతి ఒక్కరి కల కూడా అదే. నావరకైతే ఇదే చివరి ప్రపంచ కప్ కావొచ్చు. అదే మైండ్‌సెట్‌తో బరిలోకి దిగుతా. ఇప్పటి వరకు మేం సాధించలేకపోయిన దానిని అందుకొనేందుకు ప్రయత్నిస్తాం. అదే సమయంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. మేం పోషించాల్సిన పాత్రపై స్పష్టత ఉంది. క్రమశిక్షణతో ఆడతాం. అప్పుడే గెలిచే అవకాశాలు మనకు మెరుగ్గా ఉంటాయి. జట్టులో ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభవం ఉంది. అందరూ అద్భుతమైన టాలెంట్ ఉన్న ప్లేయర్లే. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంటామని బలంగా చెప్పగలను. ప్రతి ట్రైనింగ్ సెషన్‌లోనూ మేం వందశాతం కష్టపడ్డాం. జట్టులోని ప్రతి ఒక్కరూ ఏదో సాధించాలనే లక్ష్యంతోనే ఉన్నారు. ఫిట్‌నెస్‌పై మా కోచ్ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఎందుకంటే.. ఫిట్‌గా ఉంటే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ఆస్కారం ఎక్కువ. గోల్స్ కొట్టడం మీదనే కాకుండా.. డిఫెన్స్‌పైనా వర్కౌట్ చేశాం. ప్రత్యర్థి పాకిస్థానా? ఇతర జట్టా? అనేది ముఖ్యం కాదు. మా ప్రణాళిక ప్రకారం ఆడతాం. గెలిచి తీరుతాం" అని మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.

### 600వ టెస్టుకు నాయకత్వం గర్వంగా ఉంది..

# ఆ బెర్తే మా లక్ష్యం : గిల్



శనివారం నుంచి శ్రీలంకతో టీమ్ఇండియా తొలి టెస్టు మ్యాచ్‌లో తలపడనుంది. మరోవైపు టెస్టు సారథిగా శుభ్‌మన్ గిల్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కిది 600వ మ్యాచ్. ఇలాంటి మైలురాయి టెస్టుకు నాయకత్వం వహించనుండటం గర్వంగా ఉందని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుందని తెలిపాడు. "కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగానే ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం" అని గిల్ తెలిపాడు.

**సమయం ఇవ్వాలి..**

"మెరుగ్గా మారేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం ఇవ్వాలి. కొందరికి కాస్త ఎక్కువ టైమ్ పడుతుంది. అయినా సరే వారికి మద్దతుగా నిలుస్తాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బాగా ఆడాడు. అతడు గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ - మేనేజ్‌మెంట్ మధ్య సంబంధాలు సరిగా లేవని వస్తోన్న ఆరోపణలన్నీ అవాస్తవం. మేం అనుకొన్నంత వేగంగా సాయి సుదర్శన్ ఇంప్రూవ్ కాలేదు. అయితే, మా స్క్వాడ్‌లోని 15 మందిపై నమ్మకం ఉంది. తుది జట్టు ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేను. పేసర్ల విషయంలోనూ ఎంపిక కష్టంగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. బౌన్స్‌ను రాబడతాడు. అయితే, ప్రసిద్ధ్ వార్మప్ మ్యాచ్‌లో చాలా చక్కగా బంతులేశాడు. సిరాజ్‌తోపాటు మరొక పేసర్ ఎవరనేది తేల్చడం కాస్త క్లిష్టమైన నిర్ణయమే.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com